క్లుప్తంగా

బ్లాక్‌బెల్ట్ ఫోర్త్ డాన్ ప్రదానం



భూత్పూర్: మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన కృష్ణమాచారికి ఆదివారం హైదరాబాద్‌లో బ్లాక్ బెల్ట్ ఫోర్త్ డాన్ అవార్డును సినీ హీరో సుమన్ ప్రదానం చేశారు. ఈ మేరకు వివరాలను సీనియర్ మాస్టర్, తెలంగాణ స్టైల్ చీఫ్ ఇలియాస్ బిన్ సిద్దిక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చిక్కడపల్లిలో శ్రీ త్యాగరాయ గానసభ ఆడిటోరియంలో కార్యక్రమం జరిగినట్లు వివరించారు.

బీజేపీలో చేరిక

నవాబుపేట: దేశంలో మరోసారి మోదీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. ఆదివారం మండలంలోని కాకర్‌జాల్, రుద్రారం గ్రామాలకు చెందిన పలువురు వివిధ పార్టీల కార్యకర్తలు ఆమె నివాసంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆమె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. జడ్చర్ల బీజేపీ నాయకురాలు శ్రీవిద్య, జిల్లా నాయకులు బాలు, సతీష్, గోపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి మాజీ సర్పంచ్

బాలానగర్: నేరళ్లపల్లి మాజీ సర్పంచ్ ఖలీల్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం రంగారెడ్డిగూడలోని ఎమ్మెల్యే నివాసంలో పలువురు గ్రామస్తులతో కలిసి ఎస్టీసెల్ అధ్యక్షుడు బద్రునాయక్ ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. యాదయ్య, సురేందర్ ప్రసాద్, మండల అధ్యక్షుడు శంకర్ నాయక్, బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని బోయపల్లి రెవెన్యూ వార్డుకు చెందిన బ్యాగరి వెంకటస్వామి ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కోఆర్డినేటర్ అమరేందర్‌రాజు, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్: మండలంలోని అగ్రహారం పొట్లపల్లికి చెందిన పలు పార్టీల నాయకులు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాయకులు నరహరి, రమణ, రమేష్, శ్రీశైలంయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

డీకే అరుణపై పోలీసులకు ఫిర్యాదు

బాలానగర్: ఓ ఇంటర్వ్యూలో డీకే అరుణ చేసిన వ్యాఖ్యలు మహిళలను కించపరిచేలా ఉన్నాయంటూ.. ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. అధ్యక్షురాలు అనసూయ, అరుణ, రజిని, శారద, యాదమ్మ, స్వాతి తదితరులు ఈ మేరకు ఎస్‌ఐ తిరుపాజీకి లిఖిత పూర్వక ఫిర్యాదు అందించారు.

మద్యం పట్టివేత



బాలానగర్: బెల్టు షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఈ మేరకు గుండేడ్ గ్రామం కుమ్మరికుంట తండాకు చెందిన పాత్లావత్ లక్ష్మణ్ అక్రమంగా విక్రయానికి పాల్పడ్డాడని పోలీసులు వివరించారు. అతడి నుంచి అమ్మకానికి సిద్ధంగా ఉన్న 7.3 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కాగా లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపాజీ తెలిపారు.

సొంత నిధులతో ట్యాంకర్ ఏర్పాటు



మద్దూరు: మద్దూరులోని శ్రీ వెంకటేశ్వర టెంట్ హౌస్‌కు చెందిన వారు మండలంలోని దోరేపల్లిలో సొంత నిధులతో తాగునీటి సరఫరాకోసం ట్యాంకర్‌ను ఏర్పాటుచేశారు. గ్రామంలో తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని వేసవికాలం మొత్తం ఉచితంగా గ్రామంలో తాగునీటి సరఫరా చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ రోజు ట్యాంకర్‌కు పూజలు నిర్వహించి నిర్వాహకులు నర్సింహులు, అంజప్ప, శ్రీనివాస్, ట్యాంకర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో అరవిందచారి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యకు పరిష్కారమెన్నడో?

- సిగ్నల్ గడ్డ వద్ద నత్తనడకన పనులు
- నిత్యం దుమ్ముధూళితో సతమతమవుతున్న వాహనదారులు



సిగ్నల్‌గడ్డ-కల్వకుర్తి రోడ్డుపై పరిస్థితి ఇలా..



సిగ్నల్‌గడ్డ-కొత్తబస్టాండ్ రోడ్డుపై రేగుతున్న దుమ్ము

జడ్చర్ల: పట్టణానికి ఆయువు పట్టులాంటి సిగ్నల్‌గడ్డ రోడ్డు పరిస్థితి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇక్కడ రోడ్డు విస్తరణ పనుల సమస్య దశాబ్దాలుగా కొనసాగుతోంది. దీంతో స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి నిత్యం జడ్చర్లకు రాకపోకలు సాగించేవారికి సైతం అవస్థలు తప్పడం లేదు. సిగ్నల్‌గడ్డ మీదుగా ప్రయాణం అంటేనే వణుకుపుట్టే పరిస్థితి దాపురించిందంటే అతిశయోక్తి కాదేమో. ప్రయాణికులు ఊపిరి బిగపట్టుకుని అతి కష్టం మీద సిగ్నల్‌గడ్డ దాటే పరిస్థితి ఉండడం గమనార్హం. ఎప్పుడు ఏ అవాంతరం వచ్చి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందోనన్న ఆందోళనలో ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఇంత దారుణంగా ఉన్నా.. రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేయించాలన్న దిశగా ఎవరూ కృషిచేయడం లేదని స్థానికులు వాపోతున్నారు.

జడ్చర్ల–కోదాడ రహదారిని కేంద్రం జాతీయ రహదారిగా గుర్తించి రోడ్డు విస్తరణ పనులకు నిధులు మంజూరు చేసింది. దీంతో పనులను చేపట్టడం సిగ్నల్‌గడ్డకు కలిసి వచ్చింది. కాగా ఇందుకోసం ఎవరూ కృషి చేసిన దాఖలాలు లేవు. అయితే ఇప్పుడయినా సిగ్నల్‌గడ్డ రూపు రేఖలు మారి ట్రాఫిక్ అంతరాయాలు తొలగిపోతాయని భావించిన పట్టణ వాసులకు ఇక్కడి పాలకులే మోకాలొడ్డారన్న విమర్శలు ఉన్నాయి. కొందరు ఉద్దేశ పూర్వకంగానే అడ్డుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే.. రీడిజైన్‌తో కొత్తగా ప్రతిపాదనలు పంపడం, నిధుల మంజూరు, టెండర్ ప్రక్రియ మొత్తం పూర్తయ్యే సరికి ఓ ఐదేళ్ల సమయం పట్టింది. టెండర్ ప్రక్రియ పూర్తయినా పనులు మొదలెట్టడంలో కూడా ఆలస్యం చోటు చేసుకుంది. తీరా అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ సిగ్నల్‌గడ్డ రోడ్డు విస్తరణ పనులు చేపట్టకపోతే ప్రజల నుండి వ్యతిరేకత వస్తుందని భావించిన పాలకులు పనులను మొదలు పెట్టారు. అయితే పనులు పూర్తిగాక పోగా మరింతగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఇదిలా ఉంటే ప్రస్తుతం సైతం పనులు పూర్తిగాక పోగా నత్తనడకన సాగుతుండడంపై ప్రజల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత అధికారులు జాడలేకుండా పోయారని.. నాణ్యత లేకుండా పనులు చేపడుతున్నారని.. సీసీ పనులకు క్యూరింగ్ కూడా సరిగా చేయడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. నిత్యం విపరీతంగా దుమ్ము రేగుతోందని.. దీంతో శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నామని చెబుతున్నారు. దీనికి తోడు కంకర పరిచి వదలేయడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కోరుతున్నారు.

కారుకొండలో అథ్లెటిక్స్ శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

నవాబుపేట: కారుకొండలో అథ్లెటిక్స్ వేసవి శిబిరం ఏర్పాటు చేసినట్లు పీఈటీ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం పాఠశాల ఆవరణలో శిబిరాన్ని జీహెచ్‌ఎం దశరథ్ నాయక్ ప్రారంభించారు. కాగా మే 31 వరకు జరిగే క్యాంపులో విద్యార్థులకు అథ్లెటిక్స్‌లో కీలకమైన పలు అంశాలను నేర్పించనున్నారు. వివిధ విభాగాల్లో నైపుణ్యం పొందేలా తీర్చిదిద్దుతామని నిర్వాహకులు వివరించారు. శిబిరం పూర్తికాగానే ధ్రువీకరణ పత్రాలు అందిస్తామని వివరించారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం



కోటకదిరలో ప్రచారం చేస్తున్న నాయకులు

చిన్నచింతకుంట: అల్లిపూరంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. గతంలో బీఆర్‌ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహనల్పించారు. మాజీ సర్పంచ్ రఘుగౌడ్ మాట్లాడుతూ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని కోటకదిర గ్రామంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. మండల కో ఆప్షన్ సభ్యుడు ఎండీ మస్తాన్, మాజీ ఎంపీటీసీ నర్సిములు, నాయకులు మల్లప్ప, మునీర్, పాపన్న, రాజశేఖర్‌రెడ్డి, నాగరాజు, సి.నాగరాజు, కొత్త నర్సిములు, పార్‌పల్లి నర్సిములు, జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ చెంత భక్తుల సందడి






నవాబుపేట: మండల పరిధిలోని మైసమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి నైవేద్యాలు, కానుకలు సమర్పించారు. ఆలయం ఆవరణ మొత్తం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా తాగునీరు తదితర వసతులు ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ గోపాల్, దేవాలయ అధికారి మధనేశ్వర్‌రెడ్డి తెలిపారు.

రామారావు ఆశయ సాధనకు కృషిచేస్తాం

నారాయణపేట రూరల్: అరుణోదయ రామారావు స్ఫూర్తితో ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు అన్నారు. ఆదివారం స్థానిక భగత్‌సింగ్ భవన్‌లో రామారావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణపై ఉద్యమాన్ని నడిపించిన మహానుబావుడని, పేదలకు అండగా ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేక పాలనపై పోరాటం చేస్తూ ప్రజలను చైతన్యవంతం చేశారన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, నర్సింహ, రాము, సాయికుమార్, మారుతి, వెంకటేష్, రాజు పాల్గొన్నారు.



ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలి



కోస్గి: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధం వంటిదని, ప్రజలు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ సూచించారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో పోలీసులు, కేంద్ర ప్రత్యేక బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ కోసమే పోలీస్ శాఖ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తుందని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో మనోధైర్యం కల్పించడంతోపాటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే పోలీస్‌శాఖ లక్ష్యంగా ఇలాంటి ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో ప్రత్యేక పోలీస్ బలగాలతో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఎఫ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గెలిపిద్దాం

పాలమూరు: మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించి ప్రధాని మోదీకి అండగా నిలవాలని క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర సభ్యుడు నాగురావు నామాజీ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం చేనేత సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నేత కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేట జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర ఓబీసీ ప్రధాన కార్యదర్శి కంచి శ్రీనివాసులు, రమేష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రచారం

దేవరకద్ర: మండలంలో సోమవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం జరుగుతుందని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిన్నరాజమూర్, కోయిల్‌సాగర్, అడవి అజిలాపూర్, నాగారం, పెద్ద రాజమూర్, బస్వాపూర్, నార్లోనికుంట్ల గ్రామాల్లో ప్రచారం ఉంటుందన్నారు.

గండేడ్: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రచారం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 9గంటలకు పగిడ్యాల్, ఆశిరెడ్డిపల్లి, పెద్దవార్వాల్, గండేడ్ మండల కేంద్రంలో ప్రచారం కొనసాగుతుందన్నారు. ఆయా గ్రామాల కార్యకర్తలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన మద్దూరి వెంకట్‌రెడ్డి మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, ఆయన సతీమణి కవిత పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకట్‌రెడ్డి కుమారుడు, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శరత్‌రెడ్డిని ఓదార్చారు. అదేవిధంగా ఏసీపీ బంటు కిషన్, ఆర్టీసీ యూనియన్ నేత అశ్వర్థామరెడ్డిలు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అడ్డాకుల: మూసాపేట మండలం చక్రాపూర్ గ్రామానికి చెందిన పెద్ద అంజన్న మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్ పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే జీఎంఆర్ సూచనతో అంత్యక్రియల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, బ్రహ్మయ్య, తిరుపతి తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా కాంగ్రెస్ ప్రచారం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలంటూ ఆదివారం స్థానిక మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. 21వ వార్డు పరిధిలోని శేషాద్రినగర్, నిషాత్‌నగర్, బీఎన్‌రెడ్డికాలనీ, బీకేరెడ్డికాలనీ, బోయినగోపాల్ కాలనీ, మణికంఠకాలనీ, మహేశ్వరికాలనీలలో పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగి ఓటర్లను అభ్యర్థించారు.

బాలానగర్: బోడజానంపేట్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి మాడమోని గోవర్ధన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాలమూర్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చల్లా వంశీచందరెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు, ప్రతాప్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



పూర్తిస్థాయిలో పథకాలు అమలు చేస్తాం



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా మండలంలోని జయప్రకాశ్‌నగర్, బండమీదిపల్లి, చిన్నపల్లి, పెద్దపల్లి, వల్లూరు, ఉదండాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఇప్పటికే కొన్ని గ్యారెంటీలను అమలు చేశామన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ వంటి పథకాలు కూడా పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని తెలిపారు. రిజర్వాయర్ కారణంగా భూ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో స్థానికులకు వివరించారు. గత ప్రభుత్వం ప్రజలపై అప్పుల కుప్ప పెట్టిపోయిందని, తాము అధికారంలోకి వచ్చాక దశల వారీగా సంక్షేమానికి పాటు పడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటయ్య, మాజీ ఎంపీపీ నిత్యానందం తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన బాదేపల్లిలోని నిమ్మబాయిగడ్డ, ఎర్రసత్యం కాలనీ, ఎస్టీ తండ, ఫజల్‌బండ తదితర కాలనీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలిసి కాంగ్రెస్ పార్టీ ఇచ్చి వాగ్దానాలు అందాయా అంటూ పలకరించారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. ఈ సారి ఎంపీ ఎన్నికలలో బీఆర్‌ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట నాయకులు దానీష్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల్ని కోటీశ్వరుల్ని చేస్తాం



కిష్టంపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం

హన్వాడ: డ్వాక్రా సంఘాల నుంచి రుణాలు పొందే ప్రతీ మహిళను కోటీశ్వరులను చేస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గొండ్యాల్, కిష్టంపల్లి, లింగన్నపల్లి గ్రామాల్లో ఆయన పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్నర్‌మీటింగ్‌లలో మాట్లాడారు. నాయకులు ఎం. సురేందర్‌రెడ్డి, కృష్ణయ్య, జానకిరాం రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రా ఘవేందర్‌రెడ్డి, చెన్నయ్య, కృష్ణయ్య, అంజిలయ్య, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు అభివృద్ధికి ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం స్థానిక 16వ వార్డు, ఎనిమిది తండా, హన్వాడకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే యెన్నం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎక్కడ చూసినా కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. నాయకులు సురేందర్‌రెడ్డి, సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్ యాదవ్, మహేందర్, రాములు, వెంకటస్వామి, మాజీ కౌన్సిలర్ శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు. సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గృహకల్పలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. బుడగజంగం వడ్డెర బస్తీ, రాజీవ్‌గృహకల్పలో పలువురు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, నాయకులు సురేందర్‌రెడ్డి, అమరేందర్‌రాజు, లింగమయ్యయాదవ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం



పార్టీలో చేరుతున్న నాయకులు

కోయిల్‌కొండ: నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీ అందించిన కోయిల్‌కొండ మండలానికి ప్రతి ఎకరాకు సాగునీరు అందించి రుణం తీర్చుకుంటానని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మండలంలోని గణపతిరాయుడి చెరువు లిఫ్టును ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. త్వరలోనే మంజూరు చేయించి పల్లెపల్లెకు సాగునీరు అందిస్తానన్నారు. అదేవిధంగా చంద్రాస్‌పల్లి, రాళ్లంపాడు చెరువు లిఫ్టుల ద్వారా మిగతా గ్రామాల అందించేందుకు కృషిచేస్తానన్నారు. అనంతరం పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా శేరివెంకటాపూర్, పారుపల్లి, మల్కాపూర్ తదితర గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పారుపల్లిలో ఎమ్మెల్యే సమక్షంలో వైస్‌ఎంపీపీ కృష్ణయ్య కాంగ్రెస్‌లో చేరారు. బ్లాక్ అధ్యక్షుడు విద్యాసాగర్, మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు రాజారఘుపతిరెడ్డి, సత్యపాల్‌రెడ్డి, యాదయ్య, కావాలికృష్ణయ్య, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వంశీచంద్‌రెడ్డిని ఆశీర్వదించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని ఆశీర్వదించి గెలిపించాలని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అప్పంపల్లి, దాసర్‌పల్లి, తిరుమలాపురం గ్రామాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల వారిదన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం కల్పిస్తుందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. బీజేపీ పదేళ్ల పాలనలో చేసిందేమీలేదన్నారు. ఆ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. అరవింద్‌కుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి తిరుపత్‌రెడ్డి, అప్పంపల్లి గ్రామ అధ్యక్షుడు బోయ నర్సింహ, నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



దేవరకద్రలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

దేవరకద్ర: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో (1978–79 బ్యాచ్) పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం మక్తల్ మండల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 45 ఏళ్ల తరువాత ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆనందంగా గడిపారు. తమకు పాఠాలు బోధించిన గోపాల్‌రెడ్డి, వెంకటయ్యను ఘనంగా సన్మానించారు. నాగిరెడ్డి, యజ్ఞభూపాల్ రెడ్డి, చంద్రశేఖర్, రాములు, జగదీశ్వర్‌రెడ్డి, సాయిబాబా, జగదీశ్, రామాచారి పాల్గొన్నారు.



వేములలో ..

అడ్డాకుల: వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం (2003–04వ సంవత్సరం) పూర్వ విద్యార్థులు సమ్మేళనాన్ని నిర్వహించారు. నాటి గురువులు కొండారెడ్డి, రాజశేఖర్, శ్రీనివాసులు, శారద, మంజులను ఘనంగా సన్మానించారు. చెన్నకేశవులు, రాజు, రఘు, రమేష్, రామేశ్వరమ్మ, కవిత, సుజాత, సావిత్రి, తిరుపతినాయక్, చందునాయక్, రామాంజనేయులు ఉన్నారు.